# శవజీవనం

"ఏం బతుకేనుంది? సచ్చి సెడి నువ్వు నెలకు సద్దేస్తే రోజూ సాసిందో పులిసిందో గిన్నె డన్నం తెస్తంటే ఎట్లానే బతికేది?

ఇంతమంది నా కొడుకు లున్నారు. ఈల్లకే తిండి బెట్టేదెట్టా? అడక్కరమ్మని సంపిస్తే ఒక్క నా కొడకూ సైస తేలేడు. పిడికెడు తిండి, జానెడు బట్ట అడుక్కోలేరా? ధూ! ధూ! కాండ్రించి వున్మాడు యాదయ్య.

గుడ్ల నీరు కుక్కుకుంది నర్సమ్మ.

దాని మనస్సంతా పాడై పోయింది. వాడి మాటలకి. చుట్టూ ఉన్న పిల్లల వైపు దీనంగా చూసింది.

వెన్నెల మసక వెలుతుర్లో అందర్నీ తేరిపార చూసింది. పది మంది పిల్లలు! ఎనిమిది మగ, ఇద్దరాడ!

అందరూ తన కడుపున పుట్టిన పిల్లలే- కాదంటే వీడికే పుట్టినోళ్లు అరుగురు! తను తన మొగుడితో ఆయిగా కాపరం చేసుకుంటూ పిల్లలతో పిల్లల కోడిలా బతుకుతూ ఉండేది. కిట్టిగాడు అటాత్తుగా లారీ కింద సడిచస్తే. యీడు మారు మనువు కట్టుకున్నాడు.

మొదటి మొదట్లో బాగానే ఉండేవాడు. తనను, తన పిల్లల్ని బాగానే చూసుకునే వాడు. తనకు మళ్ళీ కాన్పులు మొదలై మూడేళ్ళ కిద్దర్లాగ వుట్టారు. తనను అందరూ గుమ్మడి పాదనేవారు. పిల్లలు పుట్టడం మొదలైన కాడ్నించి యాదయ్య బుద్ధి మారిపోయింది.

ఎప్పుడూ ఆ పిల్లల్ని చీదరించుకునే వాడు బాలింతగా నెలనాళ్ళు తను విడిగా ఉండేది. మళ్ళీ కాపరం. అప్పుడే పిల్లల్ని యిసుక్కుని తిట్టేవాడు. మల్లె పొదలా ఉండే తను గోగురెమ్మలా అయింది. తన అందంతరిగింది. యవ్వనం కరిగింది.

ఎప్పుడూ ఆపరేషన్ చేసుకోమనే వాడు. కాదు కాబట్టే ఆపరేషన్ వద్దు, కష్టపడి ఎవడి కూలి వాడు సంపాదించుకుంటాడ్లే అనేది. దాంతో యాదయ్యకి మండిపోయేది.

ముఖ్యంగా తిండి, సుఖం దూరమైనప్పుడు మరీ పేట్రేగి పోయేవాడు. అందరికీ ఎండ్రిన్ పోస్తా ననే వాడు. తను దీనంగా చూస్తే నీకూ తాపి,నేనూ తాగుతాన్లేయే అనేవాడు ఏడుస్తూ.

అప్పుడు వాడి కళ్ళల్లో దుఃఖం, బాధ ఎక్కువగా కనిపించేవి. పిల్లల విషయం వస్తే క్రౌర్యం కనిపించేది.

"పెద్దోడయినా పన్లోకి పోలేదా?"

యాదయ్యమాటలతో వూహల్లోంచి బయటపడి - "వూ మనకు పనికి పోవాల నున్నా వాళ్లు పిల్చుకోవద్దూ. పండెండు, పదమూడు ఏండ్లున్నాయని మాటే కానీ కండ ఎక్కడుంది? బక్క పేగులోడు! అంది.

"నే తిండి పెట్టడం లేదనే గదా నువ్వనేది?"

"అట్లానే నేనున్లేదు!"

"అట్లన్నా! బక్క పేగులోడంటే యామని? అయినా నీకు కిట్టిగాడన్నా, వాడి పిల్లలన్నా యాస చావలా ! అడుసచ్చి నా పానానికి తెచ్చినాడు. ఆ పిల్లల మీదే నీకు ప్రేమ జాస్తి!" కసిగా అన్నాడు యాదయ్య.

"అవును! వాడి మీద ప్రేమ ఎక్కువయ్యే నీకు ఆర్గురు పిల్లల్ని కన్నాను."మాటకు మాట సమాధాన ంచెప్పింది నర్సమ్మ.

"ఆ పంది కన్నట్లు కన్నావ్?" మరి కసిగా అన్నాడు.

"అవును. పందికి కన్నట్లు కన్నాను!"

"ఏందే కూస్తన్నవ్! నేను పందినా? నువ్వు పందివి. నీ పిల్లలు పందులు! నీ కిట్టిగాడు పంది. నంజదానా!నన్ను పందంటావా?" రేగి పోతున్న కోపంతో బాదాడు గబగబా!

"పందివే కాదు.దున్నపోతువు...... గాడ్డెవు!" దెబ్బలు తింటూనే అరిచింది నర్సమ్మ.

"దున్నపోతును. గాడ్దెను.పందిని, నేను పశువు నయితే నా యెంబడొచ్చిన దానివి నువ్వు మడిసివా? నువ్వూ అంతే చావు నంజా! చావు"

బాధనంతా పళ్ళ బిగువున అణుచుకుంది నర్సమ్మ.

బాది బాది విసుగొచ్చి బయటికి వెళ్ళిపోయాడు యాదయ్య. తాటాకు వాకిలి విసురుగా వేసి వెళ్ళిపోయాడు. వాడి కాళ్ళు అలవాటుగా సారా దుకాణం వైపు దీనంగా చూస్తూ ఉండిపోయింది.

✧ ✧ ✧

అర్ధరాత్రి హటాత్తుగా మెళుకువైంది నర్సమ్మకు. శరీరం బరువూ, తన శరీరంపై తొలిగియున చీర వెంట వెంటనే తెలిశాయి. చెప్పరాని అసహ్యం కలిగింది.

"ఛీ! అని విదిలించుకో బోయింది.

"నర్సీ!" దీనంగా అన్నాడు యాదయ్య.

"బర్రెగొడ్లతో ఏం పని? బజార్లో ఎవరూ దొరక లేదా?"

"నన్ను క్షమించే! కోపంతో కొట్టి నానే! తప్పయిందే!"

"ఎవరయినా అంతే! కోపం లేకుండా ఎందుకు కొడతారు. ఛీ! ఛీ! అసహ్యంగా. పది మందిలో చంపు. నన్నూ చంపు మళ్లా పదకొండో వాడ్ని చంపడం చావడం ఎందుకు?"

"తిట్టకే! నేను యాసిరి కొచ్చి అట్టంట గానీ -నాకు నీ మీదా, పిల్లల మీదా ప్రేమ లేదూ?"

"నా మీదెందుకుండదూ? ఇదిగో! యిల్లంటప్పుడే బలే ప్రేమపుట్టతి కనిపించడంలా! ఆర్గురు!"

యాదయ్య నోరెత్త లేదు. నర్సమ్మ రెట్టించలేదు. ఆమె మనసు పై శరీరం తిరగబడింది. ఆమె మాట వినలేదది!

✧ ✧ ✧

ఉదయం లేస్తూనే పరగడుపుతోనే యాదయ్య పన్లోకి వెళ్ళాడు. తల తిప్పుతున్నట్టుగా ఉంటే కొంచెం ఉప్పు నీళ్ళు తాగి వెళ్ళింది నర్సమ్మ.

పిల్లలంతా లేచి ఆకలాకలాకలాక అంటూంటే చూళ్ళేక బయటికి వెళ్ళాడు రాముడు. వాడికి లోకం తెలుస్తోంది. తల్లి తెలుస్తోంది. మారు తండ్రీ తెలుస్తున్నాడు. అన్నిటికంటే ముఖ్యంగా ఆకలి తెలుస్తోంది.

అందుకనే పెద్ద తమ్ముడు లచ్చన్నకు చిన్న పిల్లల బాధ్యత అప్పగించి బయటికి వెళ్ళాడు. ఎట్లాగయినా కొంత తిండి, డబ్బు తీసుకుని రావాలన్నది వాడి ఆశ!

✧ ✧ ✧

పని చేస్తున్న నర్సమ్మ దగ్గిరికి ఏడ్చుకుంటూ వచ్చాడు రెండో వాడు లచ్చి! వాడొచ్చిన నిమిషంన్నరకే మిగతా ఎనిమిది మందీ అష్టగ్రహ కూటమిలా లబో దిబోమంటూ వచ్చారు.

'ఆకలి కేకలు! ఆకలి మంటలు! అనుకున్న నర్సమ్మ "ఏం రా? ఏమైంది? ఎవరు చచ్చారని అట్టేడస్తున్నారు?! నేను బాగానె ఉన్నాన్లే! ఇంకా చావలా, తిండి పెట్టి నారు! పదండి. పదండి! తలో మెతుకూ తిందురు గానీ! మీ అదృష్టమాని రాత్రి ఎవరూ సరిగా భోజనం చెయ్యక తపెలెదన్నం మిగిలి పోయిందని అమ్మగారు అన్నం పెట్టారు! అంది విసుగ్గా.

"అది కాదమ్మా! అన్న టాక్సీ కింద పడి చచ్చిపోయినాడంట! ఇదిగో యీ మనిషి వచ్చి చెప్పినాడు!" అన్నాడు బెక్కుతో లచ్చన్న.

కాళ్ళ కింద మన్ను కదలి పోయింది. కళ్ళకి మసకలు కమ్మినయ్! నీరు తెరలు తెరలుగా పొరలు పొరలుగా కళ్ళలో నిలిచింది. ఘనీభవించిన శోకం, దుఃఖాగ్నికి ద్రవీభూతమైనట్టుగా తెరలు తెరలుగా చెక్కిళ్ళపై ప్రవహించ సాగింది.

ఆరడుగుల మనిషి మూడడుగు లైనట్టు అంత దాకా పక్కనున్న మనిషి బెతుకు బెతుగ్గా ముందు కొచ్చాడు. అతను టాక్సీ ఓనరు కాదు. డ్రైవరూ కాదు. క్లీన రంతకన్నా కాదు.

బ్రోకరు. అతన్ని పిల్లను చంపిన పులిని చంపడానికి దూకబోయే లేడిలా చూసింది నర్సమ్మ.

ఆ చూపుల క్షణంలోనే మసి అయిపోయినట్టుగా "అమ్మా! నాతప్పులేదు. మీ తప్పులేదు. పిల్లవాడు అజాగ్రత్తగా ఉన్నాడు. హారన్ విని అటూ ఇటూ పరిగెత్తి టైర్ కింద పడ్డాడు. వెంటనే ప్రాణం పోయింది.

అందరూ పారిపోయారు పోలీసోళ్ళ భయానికి. పిల్లవాడిని మీ ఇంటి పద్దకి తెచ్చాను. పోలీసోళ్లకి తెలిస్తే అది వాళ్ళకే లాభం! మాకు నష్టం మీకేమో పైసా రాదు.

ఇదిగో యీ డబ్బుతో పిల్లవాణ్ణి తొందరగా బూడ్చించు!" ఆమె చేతిలో వంద నోట్లు రెండు పెట్టి గబగబా వెళ్లిపోయాడు. నోరు తెరిచి కేకేసే శక్తి కూడా లేకపోయింది. నర్సమ్మకి.

✧ ✧ ✧

పనిలోంచి పరుగు పరుగున వచ్చాడు యాదయ్య. వాడు ఇంటికి వచ్చేసరికి నర్సమ్మ కొడుకుని ఒడిలో పెట్టుకుని గోడు గోడున ఏడుస్తూంది. పక్కనే ఉన్న యాదయ్య తల్లి- గుడ్డిది- బస్సుల్నీ, లారీల్నీ, టాక్సీలను అంతెందుకు -మోటారు ఇంజన్‌ని కనిపెట్టిన వాడని తల్లితోసహా బూతులు తిడుతోంది. ఏడుస్తూంది.

చుట్టూ జనం గుమిగూడి తలోకూత కూస్తున్నారు.

నర్సమ్మ వాడిని చూడగానే -చూడ్రాచూడు. రాత్రి విషం పెడతానన్నావు. తెల్లారే సరికల్లా నీకు కష్టం లేకుండా వాడే వచ్చాడు. రా రా. వాళ్ల నాయన లారీ కింద పడి చచ్చాడు. వీడు టాక్సీ కింద పడి చచ్చాడు. మిగతా వాళ్ళని బస్సు క్రింద ఏయ్. నేను రైలు క్రింద పడతా. నువ్వూ, నీ పిల్లలూ, నీ తల్లీ చెర్లో దూకండి" అంది దుఃఖంతో అరాటంతో ఆవేశంతో.

అంతలో-యాదయ్య నోరు విప్పేంతలో పోలీసు లొచ్చారు వాసన పట్టినట్టుగా, హెడ్డు, కానిస్టేబుల్ అందరూ కట్టగట్టుకొని వచ్చారు. చుట్టూ ఉన్న మనుషులు వెల్లా చదరయ్యారు.

'కేసు మాఫీ చేద్దామనుకున్నావా నంజికొడకా! పద! బొక్కలో తోసేస్తా! ఏడాదిపాటు ఐదు కడ్డీలు లెక్కబెడితే తెలివి వస్తుంది.!' అన్నాడు హెడ్డువస్తూనే తిట్లకి లంకించుకుంటూ.

యాదయ్య భయపడ్డాడు. వాడి ముఖంలో భయాన్ని ఆ, ఆ లు చదవగల్గినంత తేలిగ్గా చదివేసిన కానిస్టేబిల్ వాడిని పక్కకి లాక్కెళ్ళి జైలుకి బేరం పెట్టేడు. తిక్కముఖం వేశాడు యాదయ్య.

'చూడే నర్సీ! రెండొంద లిమ్మంటే బిక్కముఖం పెడుతున్నాడు నంజకొడుకు. అయితే మొగుడ్ని జైలుకి పంపుతావా?'

'ఏం దయ్యా? కొడుకు చచ్చి మేం ఏడుస్తూంటే, చంపినా కొడుకుల్ని పట్టుకోక, చచ్చినా కొడుకులకు కోసం నక్కల్లాగా వచ్చినారు!"

'నోర్మయ్! ఆ నాకొడుకులు ఎస్సైగారిని సై అనిపించుకున్నారు, అయిదారొంద

లిప్పి. దాంతో కేసు కుమ్మక్కు చేయబోయినందుకు మీపై ఇరుచుకపడినాం. ఏదో కొంతరాల్తే మేం ఎల్లిపోతాం లేదా వీడు కడ్డీల వెనక పడతాడు.నువ్వూ , నీ పిల్లలూ బజార్న పడతారు! లోకరీతి, నీతి న్యాయం, న్యాయం ఖరీదు విడమరిచి ఎక్కాట్లు చెప్పినంత తేలిగ్గా చెప్పాడు హెడ్డు.

'ఓ' సులభంగా నేర్చుకున్న పసిపాపలా కొంగున ముడివేసుకున్న నూర్రూపాయల నోట్లు విప్పి ఇచ్చింది నర్సమ్మ నిర్లిప్తంగా.

'ఇంక ఫర్వాలే! తొందరగా బూడ్చెయ్యండి. ఏడ్పులు మళ్లీ ఏడ్చవచ్చు...ఇంద ఖర్చుకి.....'అని శవం మీద ఒక రూపాయి వేసి వెళ్ళిపోయారు వాళ్ళు.

✧ ✧ ✧

"ధర్మ పెబుల్లారా! సూడండి నా మనవడ్ని! ముదనష్టపోళ్ళు పొట్టన పెట్టుకున్రు. యీడిని బూడ్చనీకి కూడా డబ్బుల్లేవు. మీరు తాగే కాఫీ, మీరు కాల్చే సిగరెట్టు అంత కూడా కాదు యీని యిలవ. మీరు చెయ్యిదిలిస్తే యీన్ని మట్టి సేస్తాం!"

సెంటర్లో మనవడికి గుడ్డలు కప్పి అడుక్కుంటోంది ముసల్ది. పైసలు, పది పైసలు యాభై పైసలు రూపాయలు రాల్తున్నాయి శవం మీద.

"అమ్మగారూ వాడు నా కడుపుతొలి పంట! భద్రాద్రి రామున్న మా ఇంట్లో పుట్టాడనుకున్నాను. అయితే, యమధర్మరాజుకు వాడిమీద మనసవు తుందనుకోలేదునేను. చూచే వాళ్లకు ముద్దొచ్చేవాడు. టాక్సీకీ ముద్దొచ్చాడు. వాడిని మట్టిలో కలిసే ముందు నోట్లో చల్లటానికి ఒక్క బియ్యపు గింజయినా లేదు. నా జీతంలోంచి ఓ పది రూపాయలియ్యండి!' కన్నీళ్లతో, కాలిన కడుపుతో యాచిస్తూంది నర్సమ్మ.

"భగవంతుడు నిర్దయుడే, నర్సమ్మా ఆడే పాడే వాళ్ళంటేనే వాడి కిష్టం చూడు మీ ముసలిదాన్ని తీసుకుని పోరాదూ! లేదు మా అత్తముండని తీసుకపోరాదు. వాళ్లు వాడి కంటికి కనిపించరే! మాయదారి ముండా కొడుకు. ఇదిగో యీ యిరవై తీసుకో. జీతంలోకి కాదులే! బంగారం లాంటి పిల్లవాడు. ఎప్పుడైనా ఇంటికి వస్తే మా చంటిది చంక నేక్కేది!

ప్రాణాలకి విలువకట్టినట్లుగా డబ్బు తీసుకుంది నర్సమ్మ.

"అయ్యగారూ! నా కొడుకుని టాక్సీ గుద్దేసింది. నా కొడుకులు వాడ్ని చంపిపారిపోయినారు. దొరికితే ఆళ్ళ రక్తం కళ్ల చూద్దును. వాడిని కాటికి తీసుకుపోవాల! దీపావళికి బోనసువొద్దు. ఇప్పుడు లెక్కియ్యండి!" యాచించాడు యాదయ్య.

"ఒరే యాదయ్యా! కష్టా లెవరి కయినా వస్తాయి. దీపావళి బోనస్ మాట యిప్పుడెందుకులే! నా కొడుకూపోయాడు. ఇరవయ్యేళ్ళయినా యింకా నాకు మరుపురాలేదు. అప్పుడు నాకు మా యజమాని డబ్బిచ్చాడు. ఇదిగో యాభయి రూపాయలు. ఆ పని చూడు. ఈరోజూ, రేపూ పన్లోకి రావద్దులేః" అంటూ డబ్బు యిచ్చాడు ఫాక్టరీ యజమాని.

యూనియన్ వాళ్లు తలా కొంత చందా యిచ్చారు. వంద రూపాయలు తీసుకుని ఇంటికి వెళ్ళాడు యాదయ్య.

"మా అన్న చచ్చిపోయాడు. ధర్మం చెయ్యండి!" అని వీధి వీధి తిరిగారు పిల్లలు. చిల్లర డబ్బులు వర్షపు చినుకులా రాలేయి.

✧ ✧ ✧

సాయంకాలం ఆరు గంటలైంది.

గంట క్రితం రాముడిని భూమాత వడిలో దాచి స్నానం చేసి వచ్చాడు యాదయ్య. తల తుడుచుకుంటూ ఏడుస్తూంది నర్సమ్మ.

డబ్బంతా లెక్క పెట్టాడు యాదయ్య.

రెండొందలా ఆరవై! ఖర్చయింది నలభై!

మళ్ళీ మళ్ళీ లెక్కించి అన్నాడు నర్సమ్మతో - ఇదిగో నర్సీ! ఈ లోకం కష్టపడతామంటే పని చూపెయ్యదు! పని చేసినా సరిగా డబ్బియ్యదు! సమంగా మాడదు. శవ జీవనానికి యిలవ నేదు లోకంలో! అడుక్కుంటే డబ్బు లిసుర్తాది. చూడు - యియ్యాల మనింటికి లచ్చిమి మూడు నూర్లలో వచ్చింది. దీనితో మన మందరం మూడు నెలలు బతకొచ్చు.

బతుకుతామంటే తిండి పెట్టదు: చస్తే దానం చేస్తుంది. మనది కరమ బూమి. దరమ బూమి, పున్యబూవి మనోల్లకి దానదర్మాల్లో నమ్మకం జాస్తి.

సూస్తంటే మన తొమ్మిది మంది పిల్లలూ, నా యమ్మా వారానికో నెలకో ఆర్నెల్లకో ఒక రొకరు సస్తంటే మన తిండికి గడిసి పోద్దేమో ననిపిస్తుంది.!"

యాదయ్య మాటలకి నివ్వెర పోయింది నర్సమ్మ.

ఆమె గుండెలో చిచ్చు రేగింది. గుండె భగభగా మండసాగింది.

● 7-10-81 ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక ●